క్లుప్తంగా

బేస్‌బాల్ పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థినికి స్వర్ణం



విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల 10వ తరగతి విద్యార్థిని ఎస్.అనిత ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ళ లయోలా కళాశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 బేస్ బాల్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డి.మేరి మంజుల, వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయురాలు ఎం.శ్రీలక్ష్మి, పీడీ మెహబూబి మంగళవారం అనితను అభినందించారు.

పదవులు వచ్చిన వారు కష్టపడి పని చేయాలి

ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల: పదవులు పొందిన వారంతా కష్టపడి పని చేయాలని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని శుభమస్తు కల్యాణ మండపంలో డీసీ చైర్మన్‌ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీ చైర్మన్‌లుగా ఎన్నికైన వారు రైతుల కోసం కష్టపడి పని చేయాలన్నారు. త్వరలోనే స్థానిక సంస్థల్లో కూడా ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత కల్పించటం జరుగుతుందన్నారు. అనంతరం డీసీ చైర్మన్‌లుగా ఎన్నికైన వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భవిత దివ్యాంగుల పాఠశాలలో సెమీ క్రిస్మస్



పిడుగురాళ్ల: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న భవిత దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విజయసాయి స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పోరెడ్డి వెంగళరెడ్డి ఆధ్వర్యంలో ఈ క్రిస్మస్ వేడుకలను నిర్వహించటం జరిగింది. ముందుగా భవిత దివ్యాంగుల కేంద్రంలో కేక్ కట్ చేసి దివ్యాంగులకు అందించారు. దివ్యాంగులందరికి ప్రత్యేక బహుమతిని అందజేశారు. అనంతరం భోజన ఏర్పాట్లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల తల్లిదండ్రులు, పాఠశాల రిసోర్స్ పర్సన్ మారం అజిత్‌కుమార్, హరికుమార్, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన కలిగి ఉండాలి



మాచర్ల : రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్ అమలులోకి తెచ్చి విద్యుత్ పొదుపుకు కృషి చేస్తుందని విద్యుత్ శాఖ మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సింగయ్య అన్నారు. జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మాచర్ల పట్టణంలోని డివిజన్ కార్యాలయం నుంచి కోదండ రామాలయం వరకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ పొదుపు చేద్దామంటూ నినాదాలు చేశారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఏఈ సింగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపు చేయాలన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా వినియోగదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్‌కు ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఈ ఎ.రామయ్య, ఏఓ చంద్రశేఖర్, ఏఈ కోటేశ్వరరావు, విద్యుత్ కాంట్రాక్టర్ రెడ్యా నాయక్, విద్యుత్ శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంకుమబండ్ల గ్రామోత్సవం

మంచికల్లు(రెంటచింతల): మండలంలోని మంచికల్లు గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మ తిరునాళ్ల వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు గ్రామస్తులు కుంకుమ బండ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. సంస్కృతి సంప్రదాయాల ప్రకారం కుంకుమబండ్లు అందంగా ముస్తాబు చేసి గ్రామ పురవీధులలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కుంకుమబండ్ల వెంట తెల్లవార్లూ ఉత్సాహంగా.. ఉల్లాసంగా చిందులు వేస్తూ సందడి చేశారు. ఎస్ఐ సీహెచ్ నాగార్జున గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా భారీ బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

ఆరోగ్య కేంద్రానికి సుస్తీ

- వసతుల లేమితో వైద్య సేవలు నామమాత్రం
- ఆరోగ్య కేంద్రంపై కూటమి ప్రభుత్వం శీతకన్ను
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ప్రజలు



లాలుగారి బజార్‌లో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

దాచేపల్లి : కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రజల వైద్య సేవలకు శాపంగా మారింది. ప్రజలకు వైద్య సేవలు అందించే దేవాలయం లాంటి ఆరోగ్య కేంద్రం నిరుపయోగంగా ఉంది. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాల నిర్వహణపై కూటమి ప్రభుత్వంలో నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా దాచేపల్లిలోని లాలుగారి బజార్‌లో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నేడు అధ్వాన స్థితిలో ఉంది. ఇక్కడ మౌలిక వసతులు కల్పించటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. కనీస వసతులు లేకపోవటంతో విధులు నిర్వహించేందుకు ఆరోగ్య సిబ్బంది ముందుకు రావడం లేదు.

కరెంట్ లేదు.. నీళ్లు లేవు

ఆరోగ్య కేంద్రానికి కరెంట్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులు పలుమార్లు నగర పంచాయతీ అధికారులకు అర్జీలు పెట్టారు. రూ.1.23 లక్షల డీడీ చెల్లిస్తే ఆరోగ్య కేంద్రానికి మీటర్ ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే నిధుల కొరత ఉందంటూ నగర పంచాయతీ అధికారులు ఇప్పటి వరకు డీడీ చెల్లించ లేదు. కరెంట్ సరఫరా లేకపోవటం వలన ఇక్కడ విధులు నిర్వహించటం సిబ్బంది కూడా ముందుకు రావడం లేదు. ఇదిలా ఉండగా ఈ ఆరోగ్య కేంద్రానికి మంచి నీటి సౌకర్యం కూడా లేకపోవటంతో కేంద్రానికి వచ్చే రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

నామమాత్రపు సేవలు

ఈ ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు లేకపోవటం వలన నామమాత్రపు సేవలు అందుతున్నాయి. జలుబు, దగ్గు, జ్వరాలకు మాత్రమే ఇక్కడ వైద్య సేవలు అందిస్తుండగా పెద్దరోగం వస్తే పట్టణంలోని ఇతర వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. వైద్య పరీక్షలకు కరెంట్ లేకపోవటం వలన పాత పీహెచ్‌సీకి పంపిస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మంది వరకు ప్రస్తుతం వైద్య సేవలు పొందుతున్నారు. ఇక్కడ అన్ని వసతులు అందుబాటులో ఉంటే రోజుకి 200 నుంచి 300 మంది వరకు వైద్యసేవలు పొందే అవకాశం ఉంది.

సిబ్బందిని కేటాయించిన గత ప్రభుత్వం

దాచేపల్లిలోని లాలుగారి బజార్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి గత అక్టోబర్‌లో ప్రారంభించారు. 20 వేల జనాభాకు వైద్య సేవలు అందించటం దీని లక్ష్యం. ఇక్కడ ఒక డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు, ఫార్మసిస్ట్‌తో పాటు మరో ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. ఆరోగ్య కేంద్రానికి కరెంట్, నీళ్ల సరఫరా చేసేందుకు గత ప్రభుత్వంలో నాయకులు కృషి చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో అనుమతులు రావటం ఆలస్యమైంది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఆరోగ్య కేంద్రానికి వసతులు కల్పించటంలో పూర్తిగా విఫలమైంది.

వైద్య సేవలు అందించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పట్టుబట్టి నిధులు తెప్పించి శరవేగంగా ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీని నిర్వహణను పట్టించుకోలేదు. 20 వేల మందికి వైద్య సేవలు అందించేలా నిర్మించిన ఆరోగ్య కేంద్రం ఇప్పుడు ఉత్సవ విగ్రహంలా ఉంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి.

– షేక్ సుభానీ, దాచేపల్లి

వసతులు కల్పించాలి



దాచేపల్లిలోని లాలుగారి బజార్‌లో నిర్మించిన ఆరోగ్య కేంద్రంలో సరైన వైద్యసేవలు అందించకపోవటం బాధాకరం. గత ప్రభుత్వం దూరదృష్టితో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఆరోగ్య కేంద్రానికి సౌకర్యాలు కల్పించ లేకపోవటం బాధాకరం. గత ప్రభుత్వం కట్టించిందని వివక్ష చూపించటం మంచి విధానం కాదు. పాలకులు ఇప్పటికైనా స్పందించి తగిన సిబ్బందిని, వసతులు కల్పించాలి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

– సైదారావు, దాచేపల్లి

నిధులు సమకూరిస్తే కరెంట్

లాలుగారి బజార్‌లోని ఆరోగ్య కేంద్రానికి కరెంట్ సరఫరా ఇవ్వమని మాకు అర్జీ వచ్చింది. దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేసి నగర పంచాయతీ అధికారులకు పంపించాం. నగర పంచాయతీ ద్వారా తమకు నిధులు సమకూరిస్తే తక్షణమే కరెంట్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఆరోగ్య కేంద్రానికి ఇప్పటి వరకు కరెంట్ సరఫరా ఇవ్వలేదు. మీటర్ కూడా బిగించ లేదు.

– భగవన్, విద్యుత్ శాఖ ఏఈ, దాచేపల్లి

చర్యలు తీసుకుంటాం

ఆరోగ్య కేంద్రానికి కరెంట్ సరఫరా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో విద్యుత్ శాఖ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలకు గడువు ముగిసింది. తిరిగి ప్రతిపాదనలు పంపించాలని కోరాం. రెండు మూడు రోజుల వ్యవధిలో ప్రతిపాదనలు వస్తే తక్షణమే డీడీ చెల్లిస్తాం. కరెంట్ బిగించిన వెంటనే మంచినీటి సరఫరాకి చర్యలు తీసుకుంటాం.

– ఎండీ అప్పారావు, నగర పంచాయతీ కమిషనర్, దాచేపల్లి

గ్రామ సుస్థిరాభివృద్ధిపై శిక్షణ తరగతులు

వెల్దుర్తి: సుస్థిర గ్రామీణాభివృద్ధిపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంపీడీఓ డి.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు సుస్థిర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు రెండు విడతలలో జరుగుతున్నాయన్నారు. గ్రామాలను ఎలా అభివృద్ధి చేయాలని తొమ్మిది రకాల అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలోని సమస్యలను గుర్తించి ప్రాధాన్యతల వారీగా పనులు చేపట్టాలన్నారు. వీధి దీపాలు, డ్రైన్లు, సీసీ రోడ్లు, తాగునీరు వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులలో ఎంపీడీఓ ఫణికుమార్ తదితరులు

ప్రజల అవసరాలకనుగుణంగా పనిచేయాలి

ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్

మాచర్ల రూరల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామ ప్రజల అవసరాలకనుగుణంగా పనిచేయాలని ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ నాయక్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఎస్‌డీజీ సుస్థిర అభివృద్ధిపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గ్రామాభివృద్ధి కోసం పన్నుల శాతాన్ని పెంచటంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆర్థిక సంఘ నిధులు, ఉపాధి హామీ పనుల నిర్వహణ గ్రామాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని, వీటిని అవసరమైన చోట ఉపయోగించే విధంగా తగు ప్రణాళికలు రూపొందించటంలో సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, ఏఓ శర్మ, సీడీపీఓ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సరోజినిదేవి

పేదరిక నిర్మూలనకు చర్యలు

దాచేపల్లి : గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కేంద్రీకరణ, సుస్థిరత అంశాలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమయింది. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకుంటుందని, గ్రామాల్లో నిరుపేదలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

రెంటచింతల: మండలంలోని గ్రామాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ కె.సరోజినిదేవి అన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించుటకు 9 థీమ్స్‌పై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులలో ఆమె మాట్లాడారు. పేదరికం, ఆకలి బాధలను నివారించి ఆహార భద్రతను కల్పించి, పోషకత్వాన్ని మెరుగుపర్చడం, ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాలు పెంపు, నాణ్యమైన విద్య, అందరికీ తాగునీటి వసతి, పారిశుద్ధ్యం, గౌరవప్రదమైన ఉపాధి, ఆర్థిక వృద్ధి, అసమానతల తొలగింపు, శాంతి, న్యాయం వంటి లక్ష్యాల సాధనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ–2 వై.శివనాగేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ సీహెచ్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దార్ బత్తుల వాణి

మాచర్ల రూరల్: గ్రామాలలోని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను గ్రామీణ ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ బత్తుల వాణి కోరారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు, అడంగల్ పేరు మార్పు, భూమి హద్దులలో ఉన్న వివాదాలను ఇరుపక్షాల మధ్య సర్వే చేయించి పరిష్కరిస్తామని చెప్పారు. తమ పరిధి దాటినవి ఉన్నతాధికారులకు నివేదించి సకాలంలో పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అడంగల్‌లో పేరు మార్పు, పట్టాదారు పాసు పుస్తకాలు, పింఛన్, రేషన్ కార్డులు తదితర 13 అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖాధికారి సాంబశివరావు, ఆర్ఐ భాస్కర్, వీఆర్ఓ షేక్ ఖాజావలి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వాణి

గామాలపాడులో రెవెన్యూ సదస్సు

దాచేపల్లి : మండలంలోని గామాలపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ వైవీ కుటుంబరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పొలాల్లో గట్లు, ఆన్‌లైన్ నమోదు తదితర సమస్యలపై రైతులు అధికారులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో కూడా పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో సర్పంచ్ జంగా సురేష్, ఎంపీటీసీ షేక్ ఆదాం సాహెబ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెంటచింతలలో...

గోలి(రెంటచింతల): గ్రామీణ ప్రాంతాలలో ఎంతో కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే క్షేత్ర స్థాయిలో ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య కోరారు. మంగళవారం మండలంలోని గోలి గ్రామంలో నిర్వహించిన సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో రెవెన్యూ సమస్యలపై ప్రజలు అర్జీలు ఇచ్చిన 45 రోజులలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు దళారులను ఆశ్రయించవద్దని కోరారు. అర్జీలకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, గోలి గ్రామస్తులు 9 అర్జీలు అందచేసినట్లు తెలిపారు. ఈ సదస్సులో ఆర్ఐ పల్లా రామకృష్ణ, ఈఓ గాదె రామిరెడ్డి, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గామాలపాడులో రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న దృశ్యం



గోలి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య

సాగునీటి సంఘ డీసీ అధ్యక్షుల ఎన్నిక

కారెంపూడి: సాగు నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు (డీసీ) ఎన్నికలు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగాయి. డీసీ–2 అధ్యక్షుడిగా రెంటచింతల మండలానికి చెందిన పోట్ల నరసింహారావును డీసీ–2 పరిధిలోని వివిధ మేజర్ కాల్వల నీటి సంఘాల అధ్యక్షులు డీసీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే డీసీ–4 అధ్యక్షుడిగా కారెంపూడి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన పంగులూరి అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జలవనరుల శాఖాధికారులు ఎన్నికలను నిర్వహించారు. ఎన్నిక అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా ఎన్నికైన వారికి ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సాగర్ మేజర్ కాల్వల పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు సాగు నీటి సంఘాలు కృషి చేయాలని అలాగే మేజర్ కాల్వల నిర్వహణ సక్రమంగా చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి

రెంటచింతల: గ్రామాలలో నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నర్రా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆరోగ్య, ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇళ్లలో తాగిపడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు నీటి తొట్లలో నిల్వ ఉన్న నీరు, నివాసాల ముందున్న సైడ్ కాల్వల్లోని మురుగును తొలగించక పోతే దోమలు వృద్ధి చెంది వ్యాధులు సంక్రమిస్తాయని హెచ్చరించాలన్నారు. కచ్చితంగా దోమ తెరలను వాడాలని, మెస్ డోర్లు పెట్టించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్.కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిపూర్ణమైన హృదయంతో ప్రార్థనలు చేయాలి

రె.ఫాదర్ మాదాసు జోజప్ప

రెంటచింతల: పరిపూర్ణమైన హృదయంతో ఎవరైతే ప్రార్థనలు చేస్తారో వారికి జీవితంలో మహోన్నత సుగుణశీలి అయిన పునీత అంతోని వారు అద్భుతాలు సృష్టిస్తారని గురజాల విచారణ గురువులు రె.ఫాదర్ మాదాసు జోజప్ప అన్నారు. స్థానిక అంతోని వారి చర్చిలో 9 మంగళవారాలను పురస్కరించుకుని స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి, సహాయ గురువులు ఫాదర్ అగస్టీన్‌తో కలసి ఆయన 9వ మంగళవారం సమిష్టి దివ్యపూజా బలిని సమర్పించారు. రెవ.ఫాదర్ జోజప్ప భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ నమ్మకం లేని ప్రార్థనలు చేయడం వ్యర్థమన్నారు. మహోన్నత సుగుణశీలి పునీత అంతోని వారు దేవుడు కుమారుడైన ఏసుక్రీస్తును ఎంతో విశ్వాసంతో ప్రార్థించి ఆయన సూక్తులను దేశదేశాన ప్రచారం చేశారని గుర్తు చేశారు. అనంతరం ఈ సమిష్టి దివ్య పూజాబలిలో పాల్గొన్న భక్తులకు బన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మఠకన్యలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

రెంటచింతల: మండలంలోని రెంటచింతలలో వేంచేసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో, రెంటాల గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో, తుమ్మకోట గ్రామంలోని జనార్ధనస్వామి ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎంతో పవిత్రమైన, దివ్యమైన ధనుర్మాసంలో గోదాదేవికి విశేష పూజలు నిర్వహించడం సంప్రదాయం. ఆయా గ్రామాలలోని ఆలయ పరిసర ప్రాంతాలలో వేకువజాము నుంచి గోవింద నామస్మరణ మార్మోగింది. స్వామి వార్లు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



రెంటాలలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే జూలకంటి



మాచర్ల : పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వారికి రావాల్సిన బకాయిలతోపాటు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో పెన్షనర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు రామనాథ శర్మతోపాటు పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో గాదె రామకృష్ణారావు, మర్రెడ్డి, గాలిబ్‌సాహెబ్, నందా నరసింహయ్య, సబ్ ట్రెజరీ నాయక్, విశ్రాంత ఉద్యోగులు, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు ఉన్న బస్సులనే నడపాలి

ఎంఈవో పినాకపాణి

దాచేపల్లి : రవాణా శాఖ అధికారుల నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకున్న బస్సులనే నడపాలని ఎంఈవో పినాకపాణి అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యజమానుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని బస్సులను నడపవద్దని, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపితే సంబంధిత స్కూల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపకుండా యాజమాన్యం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. సమావేశంలో సీఆర్పీలు అబ్రహాం, చంద్రమోహన్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆర్టీసీ బస్సులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ డిపోలో నూతనంగా బస్సులను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. కొత్త బస్సులలో ప్రయాణికులు సౌకర్యంగా ప్రయాణించవచ్చని అన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్టీసీ సిబ్బందిని సన్మానించారు.

వాహనాల తనిఖీలు



మాచర్ల : పట్టణంలో అర్బన్ సీఐ ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్సై సంధ్యారాణి మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని, డ్రైవింగ్ లైసెన్సులు లేని వాహనాలపై జరిమానా విధించారు. త్రిపుల్ రైడ్, మైనర్లు డ్రైవింగ్‌పై జరిమానా విధించారు. బస్టాండ్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో పోలీసులు 70 వాహనాలు తనిఖీ చేసి కాగితాలు లేని వాహనాలపై జరిమానా విధించారు.

పెన్షనర్లకు అండగా ఉంటాం



దాచేపల్లి : పెన్షనర్ల సంక్షేమం కోసం తమ వంతు కృషి చేస్తామని, పెన్షనర్లకు అండగా ఉంటామని మండల పెన్షనర్స్ అసోసియేషన్ నేత బుర్రి కృష్ణారెడ్డి అన్నారు. నారాయణపురంలోని పెన్షనర్ల కార్యాలయంలో 21వ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ వార్షిక బడ్జెట్‌ని ప్రవేశపెట్టటంతో సభ్యులు ఆమోదించారు. పలువురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు నిస్వార్థంగా సేవలు అందించటం కోసమే ఈ అసోసియేషన్ ఏర్పాటైందని చెప్పారు. పెన్షనర్ల బకాయిలకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చూపిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యుడు బెహర శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, సుబ్బారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

20న జాబ్ మేళా

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీన జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్ సమక్షంలో ఈ జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9492158153, 9010585360 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.